క్లుప్తంగా

ఘనంగా హనుమాన్ చాలీసా


పూజలు చేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో బుధవారం హనుమాన్ చాలీసాను ఘనంగా నిర్వహించారు. స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ చాలీసా సంకీర్తన, భజనలతో భక్తిపరవశంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమానికి హాజరైనా భక్తులకు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈవో పెంచల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగుచూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు, నగరంలోని టి.చవటపల్లెకు చెందిన హేమంత్ చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. హేమంత్ భార్య దేవి (40) గతంలో రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించింది. తాజాగా మూడోసారి పిచ్చోటపల్లిలోని బావిలో దూకి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

సాహిత్యంతో సమాజ సంస్కారం

తిరుపతి కల్చరల్: సమాజాన్ని సంస్కరించేందుకు సాహిత్యమే సాధనమని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ తెలిపారు. బుధవారం యూత్ హాస్టల్లో జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘం అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజు, మన్నవ గంగాధరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యంపై విద్యార్థులకు అభిరుచి కల్పించే దిశగా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు గార్లపాటి దామోదర నాయుడు రచించిన అన్నమయ్య వేంకటేశ్వర శతకాన్ని తాళ్లపాక వంశీయుడు హరినారాయణ ఆవిష్కరించారు. డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య శతక ప్రాశస్త్యిని వివరించారు.

అంబరాన్నంటిన క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవులు


టౌన్ చర్చిలో జరిగే ప్రార్థనకు హాజరైన క్రైస్తవులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. మంగళవారం అర్ధ రాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. ప్రత్యేక భజనలతో క్యాండిల్ ర్యాలీ చేశారు. ప్రార్థనలు, ఆరాధన కార్యక్రమాలతో పాటు ప్రభోదకులు బైబిల్ సందేశం వినిపించారు. మళ్లీ బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించి క్రిస్మస్ పర్వదిన ప్రాముఖ్యతపై మత బోధకులు ప్రసంగించారు. సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏసు క్రీస్తు నామస్మరణతో మార్మోగింది. క్రైస్తవుల రాకతో చర్చిలన్నీ సందడిగా కనిపించాయి. ప్రార్థనల అనంతరం కొవ్వొత్తులు వెలిగించారు. చిత్తూరు టౌన్‌చర్చిలో క్రిస్మస్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిస్టియన్‌దాస్ బైబిల్ సందేశం వినిపించారు. పలమనేరు రోడ్డులోని జాన్‌బాస్కో చర్చిల్లో కూడా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి, ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని దైవ సందేశాన్ని విన్నారు. ఫాదర్ దేవదాస్ క్రీస్తు జీవిత విశేషాలను తెలియజేశారు. లక్ష్మీనగర్‌కాలనీలోని బీటీ మెమోరియల్ చర్చి, తెలుగు లూక్స్ చర్చి, రీడ్స్‌పేట చర్చి, జానకారపల్లిలోని హోసన్నా మందిరంలో పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. దైవ సందేశాన్ని అందించి ప్రార్థనలు చేశారు. గిరింపేటలోని షకీన ప్రార్థన మందిరంలో రెవరెండ్ జోబ్ నేతృత్వంలో కేక్‌కట్ చేసి ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ప్రదర్శించిన గీతాలాపనలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

వేడుకగా క్రిస్మస్

లోకాలకే రారాజుగా యేసయ్య జన్మించాడంటూ కీర్తించాయి. విద్యుత్ దీపాల వెలుగులతో చర్చిలన్నీ సరికొత్త శోభను సంతరించుకుని ఇది శుభోదయం అంటూ క్రీస్తు రాకను స్వాగతించాయి. ప్రత్యేక ప్రార్థనలు, గీతాలాపనలతో ప్రార్థనా మందిరాలు పులకించాయి. జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని చర్చిలన్నీ క్రైస్తవులతో నిండిపోయాయి. రోజంతా ఆరాధనలు, ప్రార్థనలతో పరవశించిపోయాయి. మత ప్రభోదకులు సభికులకు దైవ సందేశం ఇచ్చారు. అనంతరం కేక్‌కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాల ఏసును స్మరిస్తూ క్రైస్తవులు క్యాండిల్స్ వెలిగించి, ప్రార్థనలు చేశారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలకు చేపట్టారు. రాత్రి చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఏసు జనన నాటిక సన్నివేశాలు చూపులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక ప్రార్థనలు

బంగారుపాళెం: క్రిస్మస్ వేడుకలను బుధవారం మండలంలోని క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కరిడివారిపల్లె, నలగాంపల్లె, బంగారుపాళెం, ముంగరమడుగు, మాధవనగర్, తిమ్మోజుపల్లె, గుండ్లకట్టమంచి, తగ్గువారిపల్లె, బండ్లదొడ్డి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. తగ్గువారిపల్లె కార్న్ స్టోన్ చర్చిలో పాస్టర్లు శ్యామ్, జాన్‌మేరీ, దివ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఏసు జీవిత చరిత్రను గురించి చర్చి పాస్టర్లు సందేశ మిచ్చారు. శాంతి మార్గం కోసం ఆయన జాడల్లో అనుసరించాలన్నారు. సుఖశాంతులతో జీవించేలా ఏసు ప్రభువు ప్రజలను దీవించాలన్నారు. ఏసుప్రభువు పుట్టిన రోజు సందర్భంగా చర్చిల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ముంగరమడుగు గ్రామానికి చెందిన విశాంత ఉపాధ్యాయుడు యోహాన్ పేదలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

కొవ్వొత్తులు వెలిగించి..

ఐరాల: మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామున నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్త దుస్తులు ధరించి ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. ప్రత్యేక ఆరాధనలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించారు. చర్చిలను రంగురంగుల కాగితాలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రెడ్డివారిపల్లె సీయోను ప్రార్థన మందిరంలో పాస్టర్ రాజారెడ్డి ఏసుప్రభువు చూపిన ప్రేమ, కరుణ, దయ, ప్రేమను తోటి వారిపట్ల చూపాలని సందేశం ఇచ్చారు. క్రిస్మస్ పురస్కరించుకొని పేదలకు చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలువురికి విందుభోజనం పెట్టారు. అన్ని గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు.

క్రిస్మస్ సంబరంలో క్రైస్తవులు

తవణంపల్లె: ప్రేమ కరుణ ద్వారా మానవ జీవితానికి అర్థం తెలిపిన ఏసుక్రీస్తు జీవితం అందరికి ఆదర్శప్రాయం. మండలంలోని పలు చర్చిల్లో బుధవారం ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవ కుటుంబ సభ్యులు ఆనందంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు శాంతి, సౌభాగ్యాలను కలుగజేయాలని ఆశిస్తూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. చర్చిలను సుందరంగా తీర్చిదిద్దారు. చర్చి క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులతో కిటకిట లాడింది. పాస్టర్లు ఏసు క్రీస్తు గురించి ప్రార్థనలు చేయించి ఆయన జననం గురించి వివరించారు. తవణంపల్లె చర్చిలో పాస్టర్ ఏసు పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేయించారు. క్రైస్తవ సోదరులు కొత్త బట్టలు ధరించి చాలా సంతోషంగా క్రిస్మస్ పర్వదిన్నాన్ని వేడుకగా జరుపుకొన్నారు.



క్రీస్తు సందేశమిస్తున్న చర్చి పాస్టర్ డాల్విన్ క్రిస్టియన్ దాస్, సామూహిక ప్రార్థనలు


కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు


బంగారుపాళెం: తగ్గువారిపల్లె చర్చిలో ప్రార్థనలు


బంగారుపాళెం: పేదలకు దుస్తుల పంపిణీ



తవణంపల్లె: సందేశమిస్తున్న పాస్టర్ ఏసు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్


ఐరాల: సీయోను ప్రార్థన మందిరంలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ రాజారెడ్డి

వాజ్‌పేయికి పుష్పాంజలి

చిత్తూరు కార్పొరేషన్: మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయికి ఆ పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా బుధవారం గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆ పార్టీ చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో నగరంలోని 200 మంది వృద్ధులకు దుప్పట్లను వితరణ చేశారు. గ్రామాలు, జాతీయ రహదారుల అభివృద్ధిలో వాజ్‌పేయి చెరగని ముద్ర వేశారని జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీ దుర్గ నాయకులు శ్రీనివాసులు, రవికుమార్, సురేష్, రామభద్ర, గోకుల్ పాల్గొన్నారు.

తవణంపల్లె: మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షులుగా దిగుమాఘం వల్లేరు రమాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వాజ్‌పేయి జయంతి

గుడిపాల: మండలంలో బీజేపీ సీనియర్ నాయకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో బొమ్మసముద్రం వద్ద బీజేపీ జెండా ఎగురవేసి వాజ్‌పేయికి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, సాయిప్రతాప్, దేవరాజ్, శేఖర్, పెరుమాల్, శివాజి, సుభాష్, గోపి, మధు,కుమార్ పాల్గొన్నారు.


చిత్తూరు: దుప్పట్లను అందజేస్తున్న జగదీశ్వరనాయుడు, షణ్ముగం

క్యాలెండర్ ఆవిష్కరణ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో బుధవారం కరణం సంక్షేమ సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, శ్రీకామాక్షి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షులు భాస్కర్‌పిళ్లై ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు షణ్ముగంపిళ్లై, తులసీకుమార్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంపిళ్లై, సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, కోశాధికారి సుబ్రమణ్యంపిళ్లై, కమిటీ సభ్యులు శంకరన్, హరిహరప్రసాద్, రవిచంద్ర, గురునాథం, లోకేష్, రుక్మాంగధ, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌లాల్ పాల్గొన్నారు.


కరణం సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పంట మార్పిడి.. నాణ్యమైన దిగుబడి!

- మంచి ఆదాయం.. సాగు సులభతరం
- ఆదర్శంగా నిలుస్తున్న విద్యావంతుడు వంశీకృష్ణ

తవణంపల్లె: వ్యవసాయంలో పంటమార్పిడితో నాణ్యమైన దిగుబడి సాధ్యమవుతుందని వ్యవసాయ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. వారి సూచనల మేరకు విద్యావంతులు వ్యవసాయంపై దృష్టి సారించి ఆధునిక పద్ధతులు అవలంబిస్తున్నారు. తద్వారా నాణ్యమైన దిగుబడితో పాటు మంచి ఆదాయం సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని దిగువ మోదలపల్లెకు చెందిన వంశీకృష్ణ డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసేవారు. అయితే ఉన్న పొలంతోపాటు మరి కొంత పొలాన్ని లీజుకు తీసుకొని పంటల సాగుపై దృష్టి సారించారు. సుమారు 3 ఎకరాల్లో టమాటా పంట సాగు చేశారు. నిరంతరం పొలంలో పంటను పర్యవేక్షిస్తూ సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నాణ్యమైన దిగుబడి సాధిస్తున్నారు. కష్టానికి తగిన ఆదాయం గడిస్తున్నారు. గత సంవత్సరం వంగ పంటను సుమారు 3 ఎకరాల్లో సాగు చేశారు. అప్పుడు కూడా నాణ్యమైన దిగుబడి రావడంతో మంచి లాభాలు వచ్చాయి. అంతకు ముందు టమాటా పంట సాగు చేశారు. ఇప్పుడు తాజాగా వరి పంట సాగుకు పొలం సిద్ధం చేశారు. ఇలా పంట మార్పిడితో నాణ్యమైన దిగుబడి సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


దిగువ మోదలపల్లె వద్ద సాగులో ఉన్న టమాట పంట

యాజమాన్య పద్ధతులు

పొలాన్ని లోతుగా దుక్కి దున్నాలి. పొలంలో సేంద్రియ ఎరువులు వేసి దుక్కిలో కలిపి దున్ని 3 అడుగుల వెడల్పుతో పాదులు(గడ్డలు) ఏర్పాటు చేసి దానిపై కలుపు రాకుండా నివారించడానికి పాలిథిన్ కవర్లు అమర్చాలి. ఒక అడుగు దూరంలో మొక్కలు నాటించారు. పురుగులు ఆశించిన టమాటా మొక్కలు, పండ్లను తొలగించి నాశనం చేయాలి. చివరిగా పండ్లను కోత కోసిన వెంటనే పంట అవశేషాలను తొలగించాలి.

తెల్ల దోమ

తల్లి పురుగులు, పిల్ల పురుగులు ఆకు కింది భాగంలో రసం పీలుస్తూ దాడి చేస్తాయి. ఆకులు పండుబారుతాయి. తెల్ల దోమ ఈగలు తేనె మంచును విడుదల చేసి మసి తెగులుకు కారణమవుతాయి. వీటిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టి నశింప చేయాలి.


గుత్తులు గుత్తులుగా కాసిన టమాట

పురుగులు, తెగుళ్ల బెడద

- టమాట పంటకు మొదట ఆకుమాడు తెగుళ్లు, బూడిద తెగుళ్లు సోకుతాయి. వాటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలి.
- కాయ తొలుచు పురుగులు, పొగాకు లద్దెపురుగు, ఊజీ పురుగులు(సూది పురుగు) ఆశిస్తున్నాయి. వీటి నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- ఆకులపై, ఆకు తొడిమలపై, కొమ్మలపై, కాయలపై బ్యాక్టీరియా మచ్చలు వస్తాయి. వర్షాకాలంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. వీటి నివారణకు స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

నూతన టెక్నాలజీతో సాగు చేశాను.



చదువుకొని ఉద్యోగం పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ వ్యవసాయంపై ఉన్న మమకారంతో ఆధునిక పద్ధతులపై దృష్టి పెట్టాను. గత నాలుగేళ్లుగా వంకాయ, టమాట పంటలను మార్చి మార్చి సాగు చేశాను. యాజమాన్య పద్ధతులు పాటించి నిత్యం పంటలను పర్యవేక్షించడం వల్ల నాణ్యమైన దిగుబడి సాధించాను. పలమనేరు, ఏలూరు మార్కెట్‌కు తరలించాను. గిట్టుబాటు ధరలు లభించడంతో మంచి ఆదాయం వచ్చింది. టమాట పంట సాగుకు వాతావరణం సహకరించలేదు. దీంతో ఆశించిన దిగుబడి రాలేదు. ముఖ్యంగా పంట మార్పిడి చేయడం వల్లే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు. నూతన వ్యవసాయ పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించి, గిట్టుబాటు ధరలు లభించి రైతు నిలదొక్కుకోవచ్చు.

– వంశీకృష్ణ, రైతు

మెలకువలు పాటించాలి



ఉద్యాన పంటల సాగులో రైతులు మెలకువలు పాటిస్తే నాణ్యమైన దిగుబడి సాధించి అధిక ఆదాయం సాధించవచ్చు. టమాట పంటకు బీమా సౌకర్యం ఉంది. రైతులు ఏ మార్కెట్‌లో ధరలు బాగా పలుకుతున్నాయో తెలుసుకుని అక్కడికి తరలిస్తే మంచి ఆదాయం వస్తుంది. యాజమాన్య పద్ధతులు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన పంట దిగుబడి సాధించవచ్చు.

– సాగరిక, ఉద్యానవన శాఖ అధికారి

ఉచిత గ్యాస్‌కు టోకరా

కాణిపాకం: ఉచిత గ్యాస్ మంట రేకెత్తిస్తోంది. దీపావళికి పేల్చిన ఉచిత గ్యాస్‌కు ప్రభుత్వం టోకరా వేసింది. లబ్ధిదారులు ఉచిత గ్యాస్‌పై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ నగదు జమ కాక లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు నగదు జమ చేశామని చెబుతున్న క్షేత్రస్థాయిలో చాలా మంది ఖాతాలోకి నగదు జమ కాక లబ్ధిదారుల ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఇంతవరకు పడలేదు

గత నెలలో ప్రభుత్వం అందించిన సిలిండర్ తీసుకొన్నాను. ఇంత వరకు నాకు బ్యాంకులో సిలిండర్ డబ్బులు పడలేదు. పడతాది పడతాది అని చెబుతున్నారు. ఇంతవరకు పడలేదు. దీనిపై ఎవరిని అడిగినా తెలీదంటున్నారు. ఫ్రీ సిలిండర్ నగదు ఖాతాలో జమ చేయాలని కోరుతున్నా.

– రాజ్యం, బంగారు పాళ్యం

నగదు సకాలంలో అందించాలి



ప్రభుత్వం గత నెల వినియోగదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రారంభించింది. సిలిండర్ డబ్బును వినియోగదారుల బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని చెప్పింది. కొంతమంది లబ్ధిదారులకు ఇంతవరకు జమ కావడం లేదు. దీంతో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతిక కారణాలతో నగదు జమ కాలేదని వాపోతున్నారు. సిలిండర్ నగదు జమ చేయాలి.

– బంగారు మురళి, సీపీఎం నాయకుడు, బంగారుపాళెం